క్లుప్తంగా

ఆదివాసీ బిడ్డకు అవకాశమివ్వండి



వెంకటాపురం(కె): పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదివాసీ బిడ్డా మైపతి అరుణ్ కుమార్‌కు అవకాశం ఇచ్చి గెలిపించాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి కోరారు. గురువారం మైపతి అరుణ్ కుమార్‌కు మద్దతు తెలిపి మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ సమస్యలపై పోరాడి, సమస్యలపై పార్లమెంట్‌లో గలం విప్పాలంటే అరుణ్ కుమార్‌ను గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులు పూనెం ప్రతాప్, అర్జున్, సుమంత్ తదితరులు ఉన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు విద్యార్థి ఎంపిక



మల్హర్: ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 9.2 జీపీఏతో మండలంలో తృతీయ స్థానంలో నిలిచిన వల్లెకుంట జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థి కనకం సాగర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ మానకొండూరు కళాశాలలో బీపీసీలో సీటు పొందాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సాగర్ ఎంపిక కావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శం, ఉపాధ్యాయులు రఘువీర్ నాయక్, మహేశ్వరి, రాజునాయక్, స్వర్ణకుమారి అశోక్‌కుమార్, షేక్ మోహరాజ్, పుష్పలత అభినందించారు.

మండల అధ్యక్షుడిగా రాకేశ్



ఏటూరునాగారం: బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడిగా పెయ్యాల రాకేశ్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాయించు నాగరాజు అతిథిగా హాజరై రాకేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాడిచర్ల రాజశేఖర్, కర్ణ సంపత్, ప్రణయ్, రామ్ కిశోర్, చక్రవర్తి, మహేష్ తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలి

వాజేడు: వాజేడు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా నిర్వహించే డిజిటల్ సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సెక్రెటరీ సోమ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. త్వరలోనే మినీ ఏటీఎమ్ సర్వీసును ప్రారంభిస్తామన్నారు.

వైద్యశిబిరం



కన్నాయిగూడెం: మండల పరిధిలోని మలకపల్లి, చిట్యాల గ్రామాల్లో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఫివర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

ఇసుక లారీ ఢీకొని ఫొటోగ్రాఫర్ మృతి



ఏటూరునాగారం: ఇసుక లారీ ఢీకొని ఫొటోగ్రాఫర్ బందెల సాంబయ్య (32) మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని జీడివాగు ప్రాంతం వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది.వివరాలు ఇలా ఉన్నాయి.. సాంబయ్య పని నిమిత్తం ఏటూరునాగారం వచ్చి పని ముగించుకుని తన గ్రామమైన మంగపేట మండలం కమలాపురానికి వెళ్తున్న క్రమంలో జీడివాగు వద్ద ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీకొట్టింది. దీంతో సాంబయ్య తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ మండల రాజు, ఎస్సై కృష్ణప్రసాద్ సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలి



ములుగు రూరల్: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు



ఎస్ఎస్‌తాడ్వాయిలో..

ములుగు రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని ముద్దునూరితండా, కొడిశలకుంట, గుర్తూర్‌తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల పని ప్రదేశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాల్లో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్‌కుమార్, తిరుపతిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: చేతి గుర్తుకు ఓటేసి ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తండాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఎనగంటి రామయ్య అన్నారు. గురువారం మండలంలోని నార్లాపూర్ గ్రామంలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి ఓటేయొద్దన్నారు. పదేళ్ల పాలనలో ఇప్పటి వరకు రేషన్ కార్డులు, ఇళ్లు ఇచ్చి పాపాన పోలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మొక్క శ్రీనివాస్, నాయకులు సంజీవరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గురువారం చల్వాయి



చల్వాయిలో..

గ్రామంలో గుండెబోయిన నాగలక్ష్మీ, పోశాల రాజు, దేవరపల్లి మల్లారెడ్డి, గజ్జెల రాకేష్, ఏదుల రాధిక ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో చాపల ఉమాదేవి, పెద్దపురం మొగిళి, లూకాస్, రమేష్, నర్సయ్య, సారయ్య, మోహన్ రావు, చుక్క కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే కూలి పెంపు



కాటారం: కూలీలతో మాట్లాడుతున్న శ్రీనుబాబు



మహాముత్తారం: ప్రచారం చేస్తున్న నాయకులు

కాటారం: కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ఉపాధిహామీ కూలీలకు రూ.400 కూలి పెంపు అమల్లోకి వస్తుందని ఆ పార్టీ యువ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులు జరిగే వద్ద శ్రీనుబాబు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. అంతకముందు మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో వంశీ గెలుపు కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు చీమల రాజు, కొట్టె శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా మండలంలోని మీనాజీపేట గ్రామంలో గల రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ చేతిగుర్తుపై ఓటువేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పక్కల సడువలి, నాయకులు ఓలపు శంకర్‌పటేల్, లింగమల్ల దుర్గయ్య, ఇనుగొండ వెంకట్ రెడ్డి, గంట దేవేందర్‌రెడ్డి, ముక్కెర రాజమల్లు, తూటి భాస్కర్‌రెడ్డి, సుగుణాకర్‌రావు, వెన్నపురెడ్డి సాంబశివరెడ్డి, నవరాంనాయక్, పుట్టపాక రాజయ్య తదితరులు ఉన్నారు.

నియామకం

రేగొండ: మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన పడగంటి ప్రకాశ్‌ను యునైటేడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ గ్రామ కన్వీనర్‌గా నియమించినట్లు మండల అధ్యక్షుడు మండల యుగంధర్ గురువారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా, మండల కమిటీలకు ప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏటూరునాగారం: బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని దొడ్లమల్లేలా గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కవిత గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మొసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. ఈ నెల 13న నిర్వహించే ఎన్నికల్లో కవితకు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, కాజా పాషా, రాంబాబు, రామకృష్ణ, రాంబాబు, సురేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



బోరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ జవహర్‌రెడ్డి

గోవిందరావుపేట: మరమ్మతులకు గురైన బోర్లను, బావులను పునరుద్ధరించి ప్రజలకు నీళ్ల కష్టాలు రాకుండా చూడాలని ఎంపీడీఓ జవహర్ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన చల్వాయి గ్రామంలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. చల్వాయి గ్రామంలోని ఆరోవ వార్డులో తాగునీటి సమస్యలతో పాటు, ఇంటి అవసరాల కోసం నీటి సమస్యలు వస్తున్నాయి అనే ఫిర్యాదులతో గ్రామంలో పర్యటించారు. పాడైపోయిన బోరుని, చెత్తచెదారంతో నిండిన బావిని పరిశీలించి వాటి పని తీరు, నీటి పంపిగ్ వివరాలను తెలుసుకోని వాటి రిపేర్ల కోసం సంబంధిత గ్రామ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో బాగు చేయించి స్థానిక ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. స్థానిక మహిళలు ఎంపీడీఓతో వారి నీటి కష్టాలను చెప్పుకోవడంతో రెండు రోజుల్లో బోరుని, బావిని బాగు చేయించి నీళ్ల బాధ రాకుండా చూస్తానని హామీ ఇచ్చాడు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తు ఎంపీడీఓకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ప్రసన్న, మిషన్ భగీరథ ఏఈ హారిక, గ్రామ కార్యదర్శి భారతి, బిల్ కలెక్టర్ దామండ్ల సాంబయ్య, జెట్టి సోమయ్య గ్రామస్తులు ఐదులపురం సత్యనారాయణ, ఏరువ మహేందర్, అనిత, కూరెల్లి వెంకటచారి, పూజారి కళావతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ నాయకుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: పట్టణంలో పాటు గ్రామాల్లో బీజేపీ నాయకులు వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం భూపాలపల్లి 17 వార్డు సుభాష్‌కాలనీలో పార్టీ నాయకులు దొంగల రాజేందర్, టీటూ క్వార్టర్స్‌లో కంబాల రాజయ్య, జంగేడులో సామల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న ఎంపీపీ, నాయకులు

కాటారం: పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు తన వైఖరి మార్చుకొని విలువలతో కూడిన రాజకీయం దిశగా ముందుకెళ్లాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాటారంలో బుధవారం రాత్రి జరిగిన బీఆర్ఎస్ కార్నర్ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబుపై ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పుట్ట మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పుట్ట మధు సహనం కోల్పోయి మంత్రి శ్రీధర్‌బాబుపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలల్లోనే మంథని నియోజకవర్గానికి రూ.330 కోట్ల అభివృద్ధి నిధులను తీసుకొచ్చిన ఘనత శ్రీధర్ బాబుదే అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న, చీమల వెంకటస్వామి, కొట్టె శ్రీహరి, కడారి విక్రమ్, చీమల రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ గొర్రె సాగర్

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన తోట చంద్రమౌళి, బండి చిన్న తిరుపతి, ఏరుకొండ రాజమౌళి, అలాగే జూకల్ గ్రామానికి చెందిన దేశ్మి వీరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ గొర్రె సాగర్ గురువారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్, జూకల్ ఎంపీటీసీ జంబుల తిరుపతి, మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్, మాజీ ఉప సర్పంచ్ చాడ ఆనంద్‌రెడ్డి, నాయకులు గుర్రం మహేందర్, రాయకోంరు, బాబా రాజు, రవీందర్, తదితరులు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



మల్హర్: డ్రమ్ములు చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు



పాపయ్యపల్లిలో గుడుంబా తయారీదారులతో ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పస్రా ఎస్సై కమలాకర్ గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాపయ్య గ్రామంలో నమ్మదగిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెపారు. ఈ దాడుల్లో ఇస్లావత్ సారమ్మ, భూక్య దరమ్‌సోత్, సమ్మక్క గుడుంబాతో పట్టుబడడంతో అదుపులోకి తీసుకోని వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా గుడుంబా తయారు చేసిన, అమ్మిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై అన్నారు.

మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి, నాచారం గ్రామంలో కాటారం ఎక్సైజ్ సిబ్బంది, డీటీఎఫ్ టీంలు సయుక్తంగా గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోని, 1950 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ మేరకు నలుగురిపై కేసులు నమోదు చేశారు. అలాగే అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన లావుడియా తిరుపతిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, కాటారం సీఐ నరేందర్, డీటీఎఫ్ భూపాలపల్లి సీఐ రాజసమ్మయ్య, కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

40 లీటర్ల గుడంబా పట్టివేత

చిట్యాల: మండలంలోని పాశిగడ్డతండా, గిద్దెముత్తారం, అందుకుతండా గ్రామాల్లో దాడుల నిర్వహించి 40 లీటర్ల గుడుంబా, 33 వందల లీటర్ల పంచాదార పానకాన్ని గురువారం ధ్వంసం చేసినట్లు ప్రోహిబిషన్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ వి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్–వరంగల్, డీటీఎఫ్ భూపాలపల్లి, ఎక్సైజ్ స్టేషన్‌లు కాటారం, భూపాలపల్లి బృందాలుగా ఏర్పడి సంయుక్తంగా మండలంలో దాడులు నిర్వహిచినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎక్కడైనా గుడుంబా అమ్మినా, తయారు చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడులలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు రమ్య, నాగయ్య, రాజ సమ్మయ్య, ఎస్సైలు రబ్బానీ, శీరిష, కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకుడు

కాళేశ్వరం: శ్రీకాళేశ్వరముక్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించి నేటికి పదహారు రోజులు కావడంతో ఆలయాధికారులు పదహారు పండుగ నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రధాన ఉత్సవమూర్తులకు సంప్రోక్షణ పూజలు, షోడోసోపచార, చతుర్వేద సేవలు, తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ మహోత్సవం

ములుగు: జిల్లా కేంద్రంలో యాదవులు బీరన్న కామరాతి కల్యాణ మహోత్సవాన్ని నేటి(శుక్రవారం) నుంచి ఈ నెల 09 వరకు నిర్వహిచనున్నారు. ఈ మేరకు యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రోజు గ్రామదేవతలకు నీళ్ల ఆరగించడం, లింగాలను గంగమ్మకు పంపడం, రెండవ రోజు చంద్రబలి వేయటం, గంగబోనం, ఎదురుబోనం, లింగాలు తీసుకరావడం, మూడవ రోజు గొర్రెను మత్తకొలువుట, సుంకుపట్టుట, తురక, మాదిగల వేశాలు, రక్తబలి వేయుట, తల్లిబోనం, లగ్గంబోనాలు, గావుపట్టుట నిర్వహిస్తారు. అలాగే నాలుగోవ రోజు లగ్గంపట్నం వేయటం, మందగావు, బోనాలు ఇంటికి వెళ్లుట, ఐదవ రోజు సందుబోనం గుడివద్దకు వచ్చుట, సాయంత్రం నాగవెల్లిబోనాలు వచ్చుట, ఆరవరోజు నాగవెల్లిపట్నం వేయుట, మహంకాళి, కామరాతి వేషాలు, బీరన్న, భోగన్న వేశాలు, అగ్నిగుండాలు, చల్లబండువ చివరిరోజు గొర్లకు బాషింగాలు, రత్తుపంచుట, పలక కొట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మళ్లీ పార్లమెంట్ ఎన్నికలో ఓట్లు అడగటం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రంగాపూర్ గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఎక్కడ అమలు చేస్తున్నారో చెప్పాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. రైతులు, ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా పదేళ్లపాటు పని చేశామని తెలిపారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కాకుండానే ప్రజలకు అనేక ఇబ్బందులు పెడతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ పార్టీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బల్గూరి తిరుపతి రావు, చదువు అన్నారెడ్డి, కోడారి రమేష్, ముడు పు రవి, రవీందరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో కూలీల పేర్ల తొలగింపు

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏపీఓకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న కూలీలు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఆన్‌లైన్‌లో జాబ్ కార్డుల పేర్లు తొలగించారని బాధిత ఉపాధిహామీ కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన సుమారు 50మంది కూలీలు గత వారం వరకు ఆరు వారాలు ఉపాధి పనులు చేశారు. కాగా ఈ వారంలో పని చేసేందుకు ఫీల్డ్ అసిస్టెంట్ డిమాండ్ పెట్టగా పేర్లు ఆన్‌లైన్‌లో తొలగిపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ బాధిత కూలీలకు ఈ విషయాన్ని చెప్పి పేర్లు లేని వారు పనికి వెళ్లవద్దని సూచించారు. ఆన్‌లైన్‌లో పేర్లు లేకపోవడంతో పాటు గతంలో పని చేసిన పేమెంట్ కూడా కాకపోవడంతో కూలీలు ఆందోళన చెందారు. దీంతో వారు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ ఇన్‌చార్జ్ ఏపీఓ అనిల్ వద్దకు వచ్చి ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించిన విషయంపై అడిగారు. ఆన్‌లైన్‌లో పేర్లు తొలగిపోయిన విషయంపై విచారణ చేస్తున్నామని కూలీలకు ఏపీఓ తెలిపారు. మళ్లీ అందరికీ జాబ్ కార్డులు జారీ చేస్తానని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఒకే గ్రామానికి చెందిన 50 మంది పేర్లు ఆన్‌లైన్‌లో తొలగించచడంతో పాటు మరో 20 మంది జాబ్ కార్డులు పూర్తిగా రద్దు చేశారని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌ల్లో పేర్లు తొలగించడంతో గత వారం పేమెంట్‌తో పాటు ఉపాధి పని కోల్పోయామని బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఏపీఓకు కూలీలు వినతి పత్రం అందజేశారు.

యువజన నాయకుల చేయూత



రేగొండ: మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన డెఫ్ క్రికెట్ క్రీడాకారుడు పసుల రాజుకు చేయుతగా మండల కేంద్రానికి చెందిన యువజన నాయకులు రూ.2500లు అందజేశారు. రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో డెఫ్ క్రికెట్‌లో రాణించి ఈ ప్రాంతానికి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు మాడగాని మనోహర్, మాడగాని నరేష్ తదితరులు పాల్గొన్నారు.